# ఎట్టుతేలు

మొన్న మేలో బి.ఇ. పాసై, ఇంకా ఉద్యోగం రాకపోడం చేతా, ఇప్పట్లో రాదనే ధీమా వుండటం చేతా, హాయిగా తెరిపిగా గడపాలని పిన్నిగారింటికి వచ్చి వారం రోజుల్నించి అక్కడే వుంటూ ఈ మధ్యనే ముక్కు చివర చిన్న కురుపు వేసిన రాజారావు పేము కుర్చీలో ధ్యాన ముద్రలో ఉన్నాడు. వేసంకాలం మధ్యాహ్నం....

రాజారావు ధ్యానమంతా ఆ ఇంట్లోనే మరో వాటాలో అద్దెకుంటున్న వాళ్ళమ్మాయి (వారం రోజుల్నించీ వీధి గది కిటికీలో కూర్చుని స్కూలు ఫైనల్ పరీక్షా ఫలితాలకై ఎదురు చూస్తున్న) వసంత గురించి. రాజారావు ఈ వారం రోజుల్లోనూ ఆమె గురించి రెండు వేల గంటలు ఆలోచించాడు. నిజానికి అంత తక్కువ వ్యవధిలో అంత ఎక్కువ ఆలోచించగలిగినం దుకు అతను తనని తాను అభినందించుకుని వుండాల్సింది; కాని అలాంటిదేమీ జరగలేదు. ఈ వారం రోజుల వసంతను గురించిన ఆలోచనా తను వసంత గురించి ఆలోచించకుండా వుండ టానికి చేసిన ప్రయత్నమేనని అతనికి తోచింది.

వసంత రాక్షసి. తను చవట.

తను ఎంతో చవట, అంచేతే చూడగానే వసంతని ప్రేమించాడు.

రెండు జడల అమ్మాయే కావచ్చు. అయితే మాత్రం?

రాక్షసులు రెండు జడలు వేసుకోలేరనా? వేసుకోగలరు.

బాధతో అతని మొహం నిప్పుల మీద వెయ్యగానే మెలికలు తిరిగే అప్పడంలా అయి పోయింది. అతనికి వెంటనే వసంత మొహం గుర్తొచ్చింది. తను ఆ మొహాన్ని ఒక్కసారే చూశాడు. అదీ వారం రోజుల క్రితం తను సూట్‌కేస్‌తో వచ్చి ఆ ఇంటి వీధి తలుపు తట్టి నప్పుడు.

అప్పుడే తెల్లవారుతోంది. రెండు సార్లు తలుపు తట్టి మూడోసారి తలుపు తట్ట బోతూండగా తలుపులు వెనక్కి వెళ్ళి పోవడం జరిగి బార్లా తెరుచుకున్నాయి. దాంతో ఏ ప్రయత్నం లేకుండా అతని నోరు మాత్రం బార్లా తెరుచుకుని అలానే ఉండిపోయింది.

వసంత!

తను పిన్ని ఇంటికి రాగానే తలుపు తీసి లోపలికి రానిచ్చిన వసంత.

ఆ తర్వాత వారం రోజుల్లోనూ మళ్ళీ మొహం చూపించని శిలాహృదయం.

అంతే. అప్పుడు ఒక్కసారి చూశాడు తను. ఇంతకాలం ఆ మొహాన్నీ, అప్పుడే నిద్ర లేచి రావడం చేత చీదరగా, అద్భుతంగా ఉన్న ఆమె ఆకారాన్నీ ఎలాగో జ్ఞాపకం తెచ్చు కుంటూ గడిపాడు తను.

అద్దె ఇల్లు అవునా? స్నానానికి, బట్టలు ఆరెయ్యడానికీ ఇంకా ఎన్నో పనులకీ పెరట్లోని రావల్సిందేగా మరి. ఎప్పుడొస్తుందో, ఎప్పుడు మాయమైపోతోందో ఒక్కసారీ తనకి కనపడ లేదు. కోపంతో ఉక్రోషంతో కుమిలిపోయాడు అతను.

తనకి కనపడకూడదా? అంత సిగ్గయితే హైస్కూలుకి వెళ్ళి ఎలా చదువు కుంటుందీ అంట? అడిగీవాళ్ళు లేకపోతే సరి!

సిగ్గు కాదని తేల్చుకున్నాడు రాజారావు. 'అబ్బే సిగ్గేం కాదు. పొగరు. తను అందమైన దన్న గొప్ప. ఎంత తెలివైన దాన్నో చూశావా నీ కంటపడకుండా వారం రోజులు ఈ ఇంట్లో మసిలాను అని చెప్పుకోవాలని!'

వసంతకి తనంటే ప్రేమలేదని ఏనాడో అనుకున్నాడు అతను. ప్రేమ లేకపోవడమే కాదు దారుణమైన అసహ్యం కూడానూ అనుకున్నాడు. ఎంత భయంకరమైన ఊహ! అతని గుండెలు గుబగుబలాడాయి. ఎందుకో తనంటే...

"ఆ. అంతే. ఆమెకి నేనో పురుగులాగో ఈగలాగో కనిపించాను కాబోలు. ఈ దేశంలో రైల్లో నూట ఏభై మైళ్ళు ప్రయాణం చేసిన ఎవరైనా రైలు దిగ్గానే హీరో నాగేశ్వరావులా ఉంటాడా? ఎవ్వడూ, ఆఖరికి నాగేశ్వరావు కూడా ఉండడు. అయితే అంచేత ఇంకెప్పుడూ, 'ఇతనింతే పరమ అసహ్యంగా డోకొస్తూ వుంటాడు' అని నిర్ణయించెయ్యడమేనా! నేనూ తనకి మల్లే హాయిగా బామ్మ దగ్గిర ముద్దు ముద్దుగా తినిపించిన అన్నం తిని, ఎనిమిది కాకుండా వాకిట్లో మంచం మీద వెంటనే పక్కెక్కేస్తే బాగానే ఉంటాను...'

వెంటనే లేచి అద్దంలో మొహం చూసుకొంటే తన మొహాన్ని తనే ముద్దు పెట్టు కోవాలనిపించింది. ముక్కు చివర చిన్న కురుపుందనుకో! అయినా పరవా లేదు. అతనికి ఉక్రోషం వచ్చింది. ఇంత అందమయిన మొహం ఉన్న తనని వసంత పురుగులా తీసి పారే స్తోంది. ఇటువంటి మొహం ఇంకే పురుగు కుంటుందనుకోందో! అనుకున్నాడు.

ఆ రోజున తలుపు తెరుచుకోగానే ఎదురుగా ఆమె! అప్పుడే చిగిర్చిన లతలాంటి ఒళ్ళు, చివర పువ్వులాంటి లేతమొహం, రెండు జడలు, వెంటనే వెనక్కి తిరిగింది. రెండు జడలలోనూ, ఒక జడకు ఉన్న రిబ్బను ఊడి తోకలా వేలాడుతోంది. జడలలో వాడిపోయిన మల్లెలు. అంతే.... ఆ తర్వాత మళ్ళీ కనబడలేదు.

పేపర్ బాయ్ పత్రిక గుమ్మంలో పడేశాడు. రాజారావు గుండెల్లో ఆశలు చిగిర్చాయి. వసంత రిజల్ట్సు. రిజల్ట్సు కోసం రాదూ, అప్పుడు చూడచ్చు అని-

కాని తను రాలేదు.

ఏడుపు దిగమింగుకుని 'పేం కుర్చీలో పడుకుని గట్టిగా చదవడం మొదలెట్టాడు. "క్రికెట్ భారత జట్టు ఓటమి. జైల్లో దొంగకి తేలుకుట్టిన వైనం. ఆంధ్రా వెర్సిటీ మెట్రిక్ పరీక్షా ఫలితాలు.. మూడేళ్ళు పోస్టు చెయ్యని ఉత్తరం..." ఓ కంటితో వసంత ఒస్తుందేమోనని చూస్తున్నాడు. కన్ను నొప్పి పెట్టింది, కాని వసంత రాలేదు. వరండాలోంచి వంటింట్లో పిన్ని దగ్గిరకు వెళ్ళి ఉంటుంది.

"అబ్బాయి చదువుతున్నాడు వెళ్ళి చూసుకో," అంటోంది పిన్ని. వసంత జవాబు వినపడదు. పిన్ని గట్టిగా అంటోంది "రాజా! ఈ నెంబరు చూడరా.... ఎంత.... ఇరవై వేల రెండు వందల ఐదు."

రాజారావుకి ఒళ్ళు మండింది. వెంటనే ఆ నెంబరు ఉందని చూసేసాడు. పైకి మాత్రం 'ఎందుకు పిన్నీ. తర్వాత చూడచ్చులే అన్నాడు...." ఒక్కసారి ఇటు రాకూడదూ? తనకేనా అంత పట్టుదల. ఓహో! ఇలాంటి వాళ్ళని చాలామందిని చూశాం" వెంటనే అతనికి గుర్తొచ్చింది. అలాంటి వాళ్ళని తనెన్నడూ చూడలేదని! వసంతలాంటి అమ్మాయిని తనింత వరకూ చూళ్ళేదు. ఇప్పుడు ఖర్మకాలి చూశాడు. అనుభవిస్తున్నాడు.

ఎదురు చూశాడు - బిక్క మొహం వేసుకుని వసంత వస్తుందని. ఆ మూడ్ లో వసంత ఎంత అద్భుతంగా ఉంటుందో!

అతని ఊహే అతనికి మిగిలింది. బిక్కమొహంతో కాదు కదా. ఏ మొహంతోనూ రాలేదు వసంత. రాజారావు కోపం నషాళం అంటింది. కళ్ళ నీళ్ళు తిరిగాయి. అంత అందమైన శరీరంలో ఎంత క్రౌర్యం! రాక్షసుల్లో కూడా అందమైన వాళ్ళుంటారని అతనికి గుర్తొచ్చింది.

ఏడుపు గొంతుతో "ఆ నెంబరు ఉంది పిన్ని! ఎవరిది అది? గోపాలం మామయ్య కొడుకు భైరవమూర్తిదా?" అని ఊరుకున్నాడు.

పోతే బావుండును. కాని పోలేదు.

ఇరవై ఆరు మైళ్ళు పాటపాడుతూ పరుగెత్తిన మనిషిలా అలిసిపోయి, మంచం మీద పడుకుని ఓ ఎస్సెల్సీ పాసైన 'బాపు గీసిన బొమ్మ!' నీ హృదయం మాత్రం దేవీ ప్రసాద్ రాయ్ చౌధురీ చెక్కలేక విసిరేసిన నల్లరాయి కదా!' అనుకుని నిట్టూర్చాడు. అతనికి 'నిస్త్రాణ' వచ్చింది!

* * *

సగం నిద్దర మగతగా పడుకుని ఆలోచిస్తుంటే హాయిగా, ఉక్కగా వుంది. రాక్షసి వసంతకి రాక్షస వివాహమే తగింది అని రాజారావు అనుకున్నాడు. తను వసంతని అద్దెసైకిల్ మీద కూర్చోబెట్టుకుని ఎత్తుకుపోడం, వసంత నాన్న, బంధువులు వెంటబడి చేతికందిన వస్తువులతో తనని కొట్టడానికి ప్రయత్నించడం, తను దెబ్బల్ని లెక్కచెయ్యక పొలాల్లోంచీ, కాలవగట్లమీంచి సైకిల్ తొక్కడం, చివరికి సైకిల్ పంచకళ్యాణిగా మారిపోయి తొక్కకుండానే దవుడాయించడం... ఊహించుకుంటుంటే అదంతా సరిగా ఎడిట్ చెయ్యని జానపద సినిమా చూస్తున్నట్టుంటుంది.

ఆ మైకాన్ని చీలుస్తూ పిన్ని మాట వినపడింది. "తేలురోయ్.... రాజా ఇటురా తేలొచ్చింది. అమ్మో.... ఎంతుందో!... పాతకలాగా...' పిన్ని ఎంతో ఉషారుగా "మామయ్యొచ్చాడ్రా రాజా...." అని పిలుస్తున్నట్టు పిలిచింది.

రాజారావు బద్ధకంగా లేచి పరుగెత్తాడు. పిన్ని చిన్న గంగాళంలోకి వంగి చూస్తోంది. తేలు గంగాళం లోపల గోడమీద వుంది. గోధుమ నూక తీద్దామని వెడితే దాంట్లో ఉందన్నమాట.

పిన్ని కూతుళ్ళూ, వసంత చిన్న తమ్ముడూ కర్రలూ, చెప్పులూ, నాపరాళ్ళూ తీసుకుని వచ్చారు. ఆయుధాలేం పనికి రావని వెంటనే కనిపెట్టాడు రాజారావు. లోపలున్న తేలుని కొడ్తే, చచ్చి గోధుమ నూకలో పడుతుంది.

అంచేత వెంటనే చీపురులోంచి ఓ పుల్ల తీసి విరిచి, దాంతో తేలుని బయటకి ఈడ్చాడు. పుల్లతో దాని తోకని నేలకి నొక్కి పెట్టి ఉంచాడు. పిన్ని ఆ గోధుమ నూకను తీసుకుని వెళ్ళిపోయింది.

"ఇదిగో దీనితో కొట్టు అన్నయ్యా..." పిన్ని కూతురు పెంకుముక్క ఇచ్చింది. వాళ్ళంతా చుట్టూ మూగి తేలుని చూస్తున్నారు.

రాజారావుకి ఆ ఎర్రతేలుని చూడగానే వసంత గుర్తొచ్చింది. ఎంతో నాజూగ్గా వుంది ఆ తేలు.

చాలామంది తేలుని చంపే ఉంటారు, కాని ఇంత మానవజాతిలోనూ తేలుని చూసిన వాళ్ళు అరుదు. ఎందుకంటే మనుషులు తేలుమీది కసితో అది ఓ కంటపడి ఇంకా రెండో కంటికి ఆనకుండానే దాన్ని పచ్చడి చేసేస్తారు. అప్పుడింక చూడ్డానికేమీ వుండదు.

రాజారావు మాత్రం పుల్లతో నేలకి నొక్కి వుంచి ఆ తేలుని చూస్తూ ఉండిపోయాడు. ఆ తేలు ఎంత లలితంగా ఉంది- పదిహేనేళ్ళ అమ్మాయిలా! కుడుతుంది అనే ఒక్క చెడు గుణం ఉండటం చేత మనుషులు దాని అందాన్ని నిర్లక్ష్యం చేశారు. వసంత తేలులా కొండితో కుట్టలేదు కాని, తనని అంతకంటే ఎక్కువే బాధించింది. ఈ తేలు ముద్దొస్తూ వుంది.

పిన్ని గరిట కడగటానికి అలా వెళ్తూ 'ఇంక చంపలేదుట్రా. అది మీకేదో ఆటబొమ్మలా వుంది. ఎప్పుడో కుట్టి పారిపోతుంది లెండి! అంది. రాజారావు గట్టిగా (వసంత వినాలని!) 'తేలు నన్ను కుట్టదు పిన్నీ! నేనే వృశ్చికలగ్నంలో పుట్టానట. అంచేత స్వజాతి అభిమానం', అన్నాడు. పిన్ని నవ్వుతూ 'నిజమే. అభిమానంతో ముద్దు పెట్టుకుంటుందిలే' అని వెళ్ళి పోయింది. రాజారావుకి మళ్ళీ వసంత గుర్తొచ్చింది. వెంటనే బ్రహ్మాండమైన ఐడియా కూడా వచ్చింది.

వెంటనే పాపని దారబ్బండి తెమ్మని తెచ్చాక దారం తెంపి జాగ్రత్తగా తేలు తోకకి కొండెకి కొంచెం పైన కట్టేశాడు.

దారం చివర పట్టుకుని వరండాలోకి వెళ్ళాడు. పిల్లలు సంతోషంతో కేరింతలు కొట్టారు. తేలుని ఎవరూ దారంతో కట్టగా చూడలేదు వాళ్ళు. తేలుని పచ్చడి చేస్తారనీ, కాని

ఆ పచ్చడి ఎవరూ తినరు అని మాత్రమే వాళ్ళకి తెలుసు. ఇప్పుడు రాజారావు దారంతో తేలుని బంధించడం వాళ్ళెంతో మెచ్చుకున్నారు.

తోకకి తాడు కట్టిన తేలు హుషారుగా ఉండదు. మనం దగ్గిరకెళ్ళి కొండిని ముట్టుకున్నా కుట్టాలని కూడా దానికి తోచదు. ఎంతసేపూ దానికి తప్పించుకోవాలనే ఉంటుంది. దానికి మామూలు సమయాల్లో మనుషుల్ని కుట్టడమే హాబీ; మనిషిని కుట్టకుండా పోనిస్తే దానికి తోచదు; మనస్సు అదోలా అయిపోతుంది. కాని కట్టేసినప్పుడు తప్పించుకుపోవటమే దాని పరమలక్ష్యం. ఆ సమయంలో అది తన జీవిత లక్ష్యమైన మనుషుల్ని కుట్టడం కూడా మరిచిపోతుంది.

రాజారావు దాన్ని ఎంత ఏడిపించాలో అంతా ఏడిపించాడు. దాన్ని ఆ గచ్చు మీద మైళ్ళ కొద్దీ పాకించాడు; విడిచేసి స్వేచ్ఛ వచ్చిందని నమ్మకం కలిగించి పారిపోతుంటే మళ్ళీ ఆపేసేవాడు. దారానికి చివర బరువులు కట్టి దాన్ని లాగించాడు. అదంతా పిల్లలకి బ్రహ్మాండంగా ఉంది. వాళ్ళు తేలుని చాలా దగ్గరగా చేతులు పెట్టడం వగైరా పనులు మొదలెట్టారు.

'అరే అంత దగ్గరకు రాకురా. కుట్టేస్తుంది,' అని గోపికి గట్టిగా వార్నింగ్ ఇస్తూనే ఉన్నాడు రాజారావు. అతని ఆశ ఆ 'ప్రమాదం' నించి తమ్ముణ్ణి రక్షించుకోడానికైనా 'ఆమె' రాదా అని.

అరగంట గడిచాక తెలిసింది ఆమె రాదని.

అలాంటప్పుడే చిరాగ్గావుంటుంది. అలాంటప్పడే మనుషులు వేదాంతులూ దుర్మార్గులూ అయిపోతారు. సుమతీ శతకం రాసిన మనిషికి వసంత తెలీదు, తెలిస్తే 'అక్కరకు రాని చుట్టము.....' పద్యంలో వసంతకి కూడా చోటిచ్చి ఉండేవాడు. ఆ మాటకొస్తే పద్యమే ఆమెతో మొదలెట్టేవాడు.

తేలు అంటే మనుషులకి మోజు అని రాజారావుకి తెలుసు. వాళ్ళ ఇంట్లో గడియారంలో దూరేసి పెండ్యులం ఉయ్యాలా ఊగే తేలుని చూడ్డానికి ఎక్కడెక్కణ్ణించో వచ్చేవారు మనుషులు; ఒక రోజుని ఏకంగా ముగ్గురొచ్చారు.

"ఎవరికోసమండీ...."

"ఊఁ ఎవరు కావాలి? మా నాన్నగారు ఓ గంటలో వస్తారు కూచోండి."

"అహ. ఎందుకు లెండి...' అని వాళ్ళు మొహమాటపడ్డారు. కొద్ది క్షణాలు గడిచాక వాళ్ళలో సాహసి" గంటలు కొట్టే గడియారం..." అని మొదలు పెట్టాడు.

తనకి అర్థం అయిపోయింది. వెంటనే గొప్పగా 'మీరు తేలుని చూడ్డానికి వచ్చారా? రండి చూపిస్తా, అని తీసుకెళ్ళి చూపించాడు తను. పెండ్యులం బాబ్ మీద వుంది చిరంజీవి సౌభాగ్యవతి ఎఱ్రతేలూ ఉయ్యాల ఊగుతున్నాననుకుంటోంది.

కాని ఈ వసంత తేలుని ఏమీ ఖాతరు చెయ్యదు. 'పోజ్' అనుకున్నాడు రాజారావు. 'ఎంత రెండు జడలయితే మాత్రం-తేలుని చూస్తేనే అరిగిపోతుందా? అయ్యో అయ్యో...!

తలుపవతల గాజుల చప్పుడు వసంతే. ఎందుకంటే వసంత బామ్మకి గాజులు లేవు.

వచ్చింది!

గోపీని లాక్కుపోడానికి.

'ఎందుకో అందుకు. మొహం చూపించకుండా ఎలా వెళ్తుందో చూస్తాను ఈసారి.'

అయినా 'ఎఫెక్ట్' కోసం "గోపీ! వేలు దగ్గర పెట్టావంటే పుటుక్కున కుట్టేస్తుంది తెలుసా?" అన్నాడు.

వసంత రాదేం?-

అతనికి తలకొట్టేసినట్లైంది. ఊరించి ఆశపెట్టి మరీ ఏడిపిస్తోంది. 'వీళ్ళ గోత్రం ఏమిటి చెప్మా! కర్కోటక అని కాదూ పిన్ని చెప్పింది' అనుకున్నాడు.

అతను ఆశవదలుకున్నాడు. తెరిపిగా వుంది.

పిన్ని కాఫీకి పిలిచింది. దారం గోపీ చేతుల్లో పెట్టి "జాగ్రత్త, విడిచేవా? కరిచేస్తుంది," అని వెళ్ళిపోయాడు. పిన్ని కాఫీకి ముందు రెండు గారెలు కూడా ఇచ్చి తినమంది. వసంత 'పరిక్షైందని' వాళ్ళ బామ్మ చేసి ఇచ్చిందిట. అతను ఆ గారెలు కుంకుడు కాయలు తింటున్నవాడిలా తిన్నాడు. శత్రువు వసంత పరిక్ష పాసై ఈ గారెలు చేయించుకుందిట! కాఫీ మామూలుగానే తాగాడు.

అతనికి లైబ్రరీలో తను చదవని బరువైన వేదాంత పుస్తకాలు గుర్తొచ్చాయి. సీరియస్‌గా వుంటాయని తను వాటిని ముట్టుకోనైనా లేదు. కాని అది చదివి ఉంటే తను వసంతని చూసినా ప్రేమించకపోను. ఈ బాధంతా తప్పి వుండేది. ఇప్పుడు బుద్ధొచ్చింది. తను కూడా పెద్ద వాడయ్యాకా ఓ పెద్ద పుస్తకం రాసేస్తాడు. అందులో మొదటి వ్యాసం "వసంతని బుద్ధున్న వాడెవడూ ప్రేమించడు..."పిన్ని మళ్ళీ కాస్త కాఫీ పోసింది. అది కూడా తాగేసి లేచి నిలుచున్నాడతను. కిటికీ లోంచి వరండాలోకి చూశాడు. అంతే నీరైపోయాడు.

వసంత తేలుతో ఆడుతోంది.

వసంత ఇంత అందంగా ఉంటుందా!

తను వారం రోజుల క్రితం చూశాడు. మళ్ళీ ఇప్పుడు చూస్తున్నాడు.

తను ఇన్నాళ్ళూ జ్ఞాపకం వుంచుకున్న వసంతకీ, ఈమెకీ పోలికే లేదు. రోజు రోజుకీ ఆమె ఊహా చిత్రం మారిపోయింది. తన తప్పేం లేదు. తప్పు ఎవరిదైనా వుంటే అది వసంతదే. తనని ఎందుకంత మురిపించి తరువాత ఏడిపించాలి?

తను వెళ్తే వసంత పారిపోతుందనే భయం వున్నా అతను వరండాలోకి వెళ్ళాడు. దారం వుంది కదా అనే ధీమాతో వసంత ఆ తేలుని గడపకింద తూములోకి వెళ్ళనిచ్చింది. దారాన్ని విడుస్తూ తేలు తూములోంచి అవతల ఆ వేపు కొస్తే చూడాలనుకుంటుంది.

వెళ్ళగానే అతను ఓ ఘోరదృశ్యం చూశాడు. వసంత తలంటుపోసుకుని వదులుగా వేసుకున్నా జడమీద తేలు ఉంది. తను పాపం చూసుకోక తేలు బయటకి వస్తుందని తూములోకి చూస్తోంది.

'దొరికిందిరా దొంగ' అనుకున్నాడు. తేలేది అన్నాడు. వసంత ఉలిక్కిపడి దారాన్ని ఇవతలికి లాగింది. దారం కొసని లాగి ఆశ్చర్యంతో అక్కడే, అలాగే ఉండిపోయింది వసంత.

రాజారావు తేలుని ఓ కంట కనిపెడ్తూ తేలుపోయింది అన్నాడు, కుర్రాడితో లెక్కల్లో నీకు సున్నా వచ్చింది' అనే మేష్టారిలా. 'ఇంత మొహం' చేసుకుని ఇంట్లోకి నడిచిపోయింది వసంత. పిల్లలతో 'తేలుని చూడండర్రా. ఏ రోలు కిందో దూరి వుంటుంది' అని గట్టిగా చెప్పి వసంతని మెల్లిగా అనుసరించాడు రాజారావు. ఇప్పుడు వసంతకి తనని ఏమీ అనడానికి హక్కు లేదు. ఎందుకంటే ఆమె గొప్పగా తన తేలుని ఎక్కడో జారవిడిచింది; అదీ ఇప్పుడు ఆమె జడ మీదే వుంది. ఆమెని రక్షించాలని తను వచ్చాననచ్చు.

వరండాలోకి వెళ్ళాక రాజారావు వేపు చూసింది వసంత ".....?!" ప్రశ్నిస్తున్నట్లు చూసింది.

"మీ జడమీద్ధ ఉంది తేలు తీద్దామని" వెల్లడి చేశాడు.

కంగారు పడబోతుంటే ఆపి, మెల్లిగా కొండికి పైగా పట్టుకుని తేలుని తీశాడు రాజారావు. కుట్టడమూ చేతకాక, మానడమూ చేతకాక తేలు కంగారు పడుతోంది. అతన్ని కూర్చోమనడమూ చేతకాక పొమ్మనడమూ ఇష్టం లేక వసంత ఇబ్బంది పడుతోంది.

'వసంతా! నే చెప్పేదంతా వింటావా? లేకపోతే తేలుచేత మొహం నిండా కరిపించేసుకొని మొహం ఉండ్రంలా అయి, కుమిలి పోయి చచ్చిపోతాను" అన్నాడు రాజారావు.

తేలు గింజు కొంటోంది వసంత నవ్వేసింది. తేలు కుడ్తుంది కాని, చంపేయ్యదని ఆమె విశ్వాసం. ఐనా వింటానని తలాడించింది.

"మీ బామ్మ ఇంట్లో లేదుగా?"

"లేదు"

"అయితే విను" అన్నాడే కాని అతనికి ఎలా చెప్పాలో తెలీలేదు. "నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని ముందే చెప్పెయడం నిద్రపోతున్న ప్రేయసిని రాళ్ళతో కొట్టి లేపినట్లుంటుదనుకున్నాడతను. అంచేత అక్కడున్న మంచం మీద కూర్చుని పిచ్చిగా ఆమె మొహంలోకి చూస్తూ ఉండిపోయాడు.

తనకి వారం రోజులు ఎంత తపించినా కనబడని మొహం. ఏం చెప్పాలీ, ఎలా చెప్పాలీ....?! ఏమీ తోచదు.

ఐదు నిమిషాలు తేలు అతని వేలు కుట్టి మరీ వెళ్దామనుకుంటోంది. రాజారావుని తెలిసిపోయింది; తను వసంతకి ఏమీ చెప్పనక్ఖర్లేదు.

వారం రోజులూ పడ్డ బాధని తల్చుకుంటూ, ప్రయత్నం లేకుండానే వచ్చిన ఏడుపు గొంతుతో "ఈ వారం రోజులూ నన్నెంత ఏడిపించావో తెలుసా?" అన్నాడు.

"తెలుసు" టక్కున చెప్పేసింది వసంత.

"చాలు" అనుకున్నాడు రాజారావు, ఆమె చెయ్యికోసం తన ఎడం చెయ్యి చూసాడు.

ఇంగ్లీషు సినీమాలు బాగా చూసిన అమ్మాయి కావడం చేత వసంత తన అరచేతిని ఎంతో అందంగా, వయ్యారంగా అందించింది." ఈ తేలు సాక్షిగా..." అంటూ ఆ అరచేతిని ముద్దు పెట్టుకున్నాడు. తనంటే తనకి నమ్మకం కుదిరిన రాజారావు.

(ఆంధ్ర పత్రిక వీక్లీ 29-7-59)

★